# ఉద్యోగం స్త్రీ లక్షణం

"కెవ్వ్." అని కేక వినబడ్డంతో రమణారావు ఉలిక్కిపడి నిద్ర లేచాడు.

కళ్ళు నులుముకుని చూసాడు ఎదురుగా ఏమీ లేదు.

"నేను కలగన్నానా?." అనుకున్నాడు రాత్రుళ్ళు డిటెక్టివ్ నవలలు చదవడం నిద్రలో కెవ్వుకెవ్వు మని అరవడం అతనికి అలవాటే.

మళ్ళీ "కెవ్వు." మని కేక వినిపించింది. ఆ కేక వంటింట్లోంచి వినిపించింది.

రమణారావు మంచంమీంచి దూకి కంగారుగా వంటగదివైపు పరుగు లేసాడు.

అక్కడ వంటగది మధ్యలో వెర్రి మొహం చేస్కుని నిల్చుంది. అతని భార్య కమల.

"ఏంటి?. ఎందుకట్టా అరిచావ్?. నేనింకా స్టవ్వంటిస్తుంటే నీ చీరకి నిప్పంటుకుందేమో అనుకున్నా." అన్నాడు రమణారావు.

"అలాగయినా బావుణ్ణు. చస్తే పీడా విరగడై పోతుంది!." అంది కమల దీనంగా.

"ఇప్పుడేమైందని?" అడిగాడు చికాకుగా రమణారావు.

"అటు చూడండి." సింక్ వైపు, చూపించింది. అక్కడ బోల్డన్ని అంట్లున్నాయ్.

"అవన్నీ నేనిప్పుడు తోముకోవాలి" అంది కమల.

"పనిమనిషేమైంది?."

"అది రాలేదు గనుకనే నేనట్టా కెవ్వుమని అరిచాను."

"ఎందుకూ అరవడం. హాయిగా తోమేసుకోవచ్చుగా?" ఆశ్చర్యంగా అడిగాడు రమణారావు.

"ఓ పంజేద్దామా?. మనిద్దరం కల్సి హాయిగా అన్ని అంట్లూ తోమేద్దాం. అలాగేనా.హి....." అంది కమల మస్కాకొడ్తూ.

"నేనా? భలేదానివే. ఉద్యోగం చేసే మగాణ్ణి నన్ను అంట్లు తోమమంటావా?." కోపంగా చూస్తూ అడిగాడు.

"ఉద్యోగం నేనుకూడా చేస్తున్నానుగా పైగా మీకంటే నా జీతం వందరూపాయలెక్కువ!" అంది కమల వింతగా చూస్తూ.

రమణారావు నాలిక కొరుక్కుని నెత్తిన ఒక్క జెల్లకాయ్ కొట్టుకుని "ప్చ్....అవును కదూ? ఆ విషయమే మర్చిపోయా. హి" అన్నాడు.

మరైతే ఇద్దరం అంట్లు తోముదామా?" సంతోషంగా అడిగింది కమల.

"హమ్మా ఆశ!. అది ఆడాళ్ళపని. మగాళ్ళదా? ఏమైనానా?.త్వరగా గిన్నెలు తోమి కాఫీ కాచి పట్రా. ఈలోగా నేను మొహం కడుక్కుంటా.

రమణారావు వంటగదిలోంచి రివ్వుమని వెళ్ళిపోయాడు.

కమల కాఫీ గిన్నె కడిగి కాఫీ పెట్టి రమణారావుకి ఇచ్చింది.

రమణారావు కాలుమీద కాలేస్కుని న్యూస్ పేపరు చదువుతూ కాఫీ సిప్ చెయ్యసాగాడు.

"అంట్లు తోమడానికి పోనీ నామోషీ. అయితే వంటలో అయినా సాయం చేస్తారా?." అని మెల్లగా అడిగింది కమల.

"వంటా?. నేనా? భలేదానివే!!. నేను మగాణ్ణి కదా?.

మరి నేను మాత్రం మీతో సమానంగా ఉద్యోగం చెయ్యడంలేదా-యేంటి.. వంటంటే వంటకాదుగానీ. వంటనేనే చేస్తాను. మీరు కూరలు తరిగి పెట్టండి."

కూరలు తరగాలా?. వామ్మోవ్. చెయ్యి తెగదూ?, అయినాఅవన్నీ చేస్తే నా కాఫీసుకి లైమైపోదూ?"

ఆఫీసుకి, నాకు మాత్రం టైం సరిపోవద్దా?" కమల గట్టిగా అరిచింది.


"అందుకే అంటున్నా ఇద్దరం ఆఫీసుకు లేటుగా వెళడంఎందుకూ.. కనీసం ఒక్కరైనా త్వరగా వెళ్తే మంచిది కదా?. అందుకే నేను నా-

ఆఫీసుకి త్వరగా వెళ్తా. నువ్వు నీ ఆఫీసుకి కాస్త లేటుగా. వెళ్లు ఆడాళ్ళు లేటుగా. వెళ్ళినా ఆఫీసర్లు ఏమీ అనరు. ఏమంటావ్? హి! అన్నాడు.

కమల నెత్తికొట్టుకుని వంటగదిలోకి పరుగుతీసింది. ఆమె హడావిడిగా కిందామీదా పడి గిన్నెలు తోముకుని వంటపని మొదలు బెట్టింది.

మధ్య మధ్య రమణారావు "ఇదిగో, గెడ్డం గీస్కుంటున్నాగానీ కాస్త నీళ్ళు పట్రా. స్నానానికి నీళ్ళు తోడు. మరో కప్పు కాఫీ ఇస్తావ్?." ఇలా అరుస్తూ ఆమెని ఇంకా కంగారు పెట్టేస్తున్నాడు.

ఒకటికి పదిసార్లు "వంటైందా?. వంటైందా?" అని అడిగి నానా హైరానా పెట్టేశాడు.




"భోంచేస్తారా వంటైంది?"

పేపర్ చదువుతున్న రమణారావు వెనక్కి తిరిగి చూసాడు.

"హర్రె!. నువ్వా లక్ష్మి ఈవేళ నువ్వు రాలేదని అమ్మగారు చాలా ఇదై పోయారు. పాపం అంట్లన్నీ అమ్మగారే తోముకున్నారు." అన్నాడు రమణారావు.

"వా...."

నీకెంత జాలిగుండె లక్ష్మీ. అమ్మగారు కష్టపడ్డారని వినగానే హెంత బాధపడి పోతున్నావో!!." జాలిగా చూస్తూ అన్నాడు రమణారావు.

"మీ బొంద. నేను లక్ష్మిని కాను. మీకూ మీ ఇంటికీ చాకిరీ చేసి ఇలాగయ్యాను?" ఘొల్లుమంది కమల.

రమణారావు చికాకు పడ్డాడు.

"సర్లె....సర్లె....నువ్విలా టైమూ పాడూ లేకుండా ఏడిస్తే నేనాఫీసుకి వెళ్ళినట్టే. నాకు టైమైపోతుందిగానీ అన్నంపడ్డించు."

"నాకూ టైమై పోతూంది? నేనింకా స్నానం కూడా చెయ్యలేదు. మీరే వడ్డించుకోకూడదు. ప్లీజ్." బతిమలాడింది కమల.

"హు.... అన్నిపన్లూ నేనే చేసుకోవాలి." గొణుక్కుంటూ డైనింగ్ హాల్లోకి వెళ్ళాడు రమణారావు.

కమల స్నానం చేసి వచ్చేసరికి రమణారావు భోజనం చేసి డ్రస్ చేసుకుని రెడీగా ఉన్నాడు.

"ఇదో. మాట!" అని కమలని పిలిచాడు.

"ఏంటండీ..?...."

"నువ్వింతకు ముందు పెట్టిన పర్సనల్ లోను తీరిపోయిందా?."

"లేదండీ...."

"కో ఆపరేటివ్ సొసైటీ లోను?"

"అది తీరిపోయిందండీ."

"అయితే ఆ లోను పెట్టి అయిదువేలు తీసుకురా."

"ఎందుకూ?." ఆశ్చర్యంగా అడిగింది కమల.

"ఎందుకేమిటే?. పేకాటకోసం నేను అప్పులు చేసాగా. అవి తీర్చాలి. వెధవలు పీకమీద కూర్చున్నారు!!."

"నా జీవితంలో బోల్డన్ని కటింగ్స్ ఉన్నాయి. మీకైతే ఏ లోనూ లేదు. జీతం ఫుల్‌గా వస్తుంది. ఆ లోన్లేవో మీరు పెట్టొచ్చు కదండీ." మెల్లగా అంది కమల.

"ఆహా. భలే ఉన్నావే!!. నా జీతంలో కటింగ్స్ ఉండకూడదు.

పుల్‌గా రావాలి. మరి నేను బార్లకీ, రేసులకీ, పేకాటకీ వెళ్ళొద్దూ?." అన్నాడు రమణారావు.

"నేను ఏ లోనూ పెట్టను. జీతం అంతా కట్ అవుతే ఇల్లెలా గడుస్తుంది?."

"అట్టాగేం?. అలాగైతే నువ్వు ఇంట్లో ఉండక్కర్లేదు. నీకూనాకు ఈ రోజుతో రాం రాం." పళ్ళు నూర్తూ అన్నాడు.

సర్లెండి. మీరు చెప్పినట్టే లోన్ కోసం అప్లయ్ చేస్తా." కళ్ళు తుడుచుకుంటూ అంది కమల.

రమణారావు ఆఫీసుకెళ్ళాక తనుకూడా అదరాబాదరాగా రెండు ముద్దలు తిని ఇంటికి తాళంవేసి ఆఫీసుకు పరుగుతీసింది కమల.

"ఏంటమ్మా.ఆఫీసుకి ఇంత ఆలశ్యంగా వస్తే ఎలా?.ఇంకోసారిలా వస్తే సియల్ కట్ చేస్తా." గుడ్లురుముతూ అన్నాడు ఆఫీసర్.

పనిమనిషి రాలేదనీ, ఇంటిపనీ వంటపనీ అన్నీ తనే చేస్కోవల్సి వచ్చిందనీ అందుకే ఆలశ్యం అయ్యిందనీ చెప్పింది కమల.

వెంటనే ఆఫీసర్ భోరున ఏడ్చాడు.

"మీ అయన చాల అదృష్టవంతుడమ్మా. నువ్వు ఉద్యోగం చేస్తూ కూడా ఇంటిపనీ వంటపనీ చేస్తున్నావ్. మా ఇంట్లో వంటపని నేనే చెయ్యాలి! చెయ్యనంటే చూసావ్‌గా పరిస్థితి ఇలా ఉంటుంది." అంటూ బుర్రకాయ్ వంచి చూపించాడు. అక్కడ పెద్ద బొడిపె ఉంది.

కమల అయనమీద సానుభూతి చూపించి తన సీట్లో కూర్చుని పనిచేస్కో సాగింది. ఓ గంట పోయాక ఆఫీసరు కమలని పిలిచాడు.

"చూడమ్మా. కొస్త ఈ రెండు ఫైళ్ళు పూర్తిచేసిపెట్టు." అన్నాడు.

కమల ఆ రెండు ఫైల్సూ అందుకుని చూసి "ఈ రెండు ఫైళ్ళూ నా సీటుకి సంబంధించినవి కాదు కదండీ. ఒకటేమో రమేష్‌ది రెండోదేమో శేఖర్‌ది." అంది.

"అవునమ్మా. నాకు తెల్సు. ఆ రమేషేమో ఏ మార్నింగ్ షో వెళ్ళిపోయినట్టున్నాడు. ఇంక శేఖర్ ఎక్కడికెళ్ళాడో ఎప్పుడొస్తాడో

ఎవరికీ తెలీదు. ఈ మగాళ్ళయితే ఎప్పుడూ సీట్లలో ఉండరమ్మా. ఆడ పిల్లలైతే చక్కగా సీట్లలో కూర్చుని పనిచేస్తారు. అసలు ఆఫీసుల్లో మగ ళ్ళని అప్పాయింట్ చెయ్యకూడదు."

"మీరు మగాళ్ళే కదండీ!!" ఆశ్చర్యంగా అడిగింది కమల.

"ఆ. నాదీ ఒక మగ బతుకేనా?" వంగి జలమీద బొప్పిని చూపిస్తూ అన్నాడు ఆఫీసర్.

కమల సాయంత్రందాకా వాళ్ళపనీ వీళ్ళపనీ చేసి అలసిపోయి ఇంటికి వెళ్ళింది.

"నేనింటికి వచ్చి అరగంట పైనైంది!! త్వరగా కాఫీ పెట్టి తగ లడు." అన్నాడు రమణారావు.

"నేనొచ్చేదాకా ఆగడం దేనికి? మీరు కాఫీ పెట్టుకోవచ్చుగా?" అంది కమల.

"హమ్మా. అది ఆడాళ్ళపని. త్వరగా కాపీ పెట్టివ్వు" గట్టిగా అరిచాడు.

ఆ రోజు రాత్రి కమల ఆలోచించింది. తాము ఉండేది ఇద్దరే. తమకి ఒక్క జీతం సరిపోతుంది. ఆపీసులోనూ ఇంట్లోనూ పని చేస్కో వాలంటే తనకి కష్టంగా ఉంటుంది. ఆపీసులో అడ్డమైన చాకరీ చెయ్యడమే కాదు. తన డిపార్టుమెంట్లో పనిచేసే కొందరు మగాళ్ల డబుల్ మీనింగ్‌తో మాట్లాడే మాటల్ని కూడా భరించాల్సి వస్తుంది అనుకుంది.

"ఏవండీ. మనం ఉండేది ఇద్దరమే. మనకి ఒక్క జీతం సరి పోతుంది కదండీ!!," అంది మంచంమీద రమణారావు పక్కన పడుకుని అతని ఛాతీమీద తల అనుస్తూ.

"నువ్వు చెప్పింది నిజమే!.... అన్నాడతను."

అతనంత తేలిగ్గా ఒప్పుకుంటాడని ఊహించని కమల ఎగిరి గంతే సింది.

మర్నాడు ఆపీసునుండి ఇంటికి వస్తూనే రమణారావు ఇలా అన్నాడు. "మనిద్దరికీ ఒక్క జీతం సరిపోతుందని అన్నావుగా.... అందుకే నా ఉద్యోగానికి రాజీనామా చేసి వస్తున్నా"

ఆ మాట వింటూనే కమల మూర్ఛపోయింది.